అహ్లువాలియాతో సీఎం రేవంత్ భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): ప్రముఖ ఆర్థికవేత్త, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు మాంటెక్‌సింగ్ అహ్లువాలియాతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం భేటీ అయ్యారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి కేంద్ర, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ఆయనతో చర్చించారు. గడిచిన పదేండ్లలో భారీగా పెరిగిన అప్పులు, వాటి ప్రభావంపై వారు చర్చించారు. కాంగ్రెస్ హయాంలో దేశంలో అనుసరించిన ఆర్థిక సంస్కరణలు, వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

వక్ఫ్ భూములను కాపాడండి

సీఎంకు మైనార్టీ ప్రతినిధుల వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వక్ఫ్ భూములను కాపాడాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డికి మైనార్టీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్‌రెడ్డి, వివిధ జిల్లాల మైనార్టీ ప్రతినిధులతో సీఎం శనివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మైనార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ అమలు జరిగేలా చూడాలని, మైనార్టీ పాఠశాలల అభివృద్ధికి తగిన బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఆయా విషయాలపై సీఎం సానుకూలంగా స్పందించారు.

ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు ప్రభుత్వానివే

- నెలకు 10 వేలు ఇవ్వాలి: ఎమ్మెల్యే గాంధీ డిమాండ్
- ఆటో తగులబెట్టుకున్న దేవ్లానాయక్‌కు పరామర్శ

మియాపూర్ నడిగడ్డతండాకు చెందిన ఆటో డ్రైవర్ దేవ్లానాయక్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్, ఫిబ్రవరి 3: మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణానికి తాము వ్యతిరేకం కాదని, కానీ ఆటో కార్మికుల జీవనోపాధికి గండి కొట్టడం ఏమాత్రం సరికాదని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు పథకంతో ఆటోలు నడవక, సరైన జీవనోపాధి లభించక రాష్ట్రవ్యాప్తంగా 15 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఇవన్నీ ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. ఆటో సరిగా నడవక, కుటుంబ పోషణ భారంగా మారి రెండు రోజుల క్రితం ప్రజా భవన్ ఎదుట ఆటోను తగులబెట్టుకున్న మియాపూర్ నడిగడ్డతండాకు చెందిన దేవ్లానాయక్‌ను ఎమ్మెల్యే గాంధీ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా దేవ్లా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ నిర్ణయంతో వందల మంది ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని ఆగ్రహించారు. కేవలం ప్రజా భవన్‌గా పేరు మారిస్తే సరిపోదని, ప్రజా సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉండాలని హితవుపలికారు. తొలి సీఎం కేసీఆర్ పాలనలో పదేండ్లపాటు సబ్బండ వర్ణాలు సంతోషంగా జీవించారని, కాంగ్రెస్ 55 రోజుల పాలనలోనే నానా యాతన పడుతున్నారని పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఉపాధి కోల్పోయిన కార్మికులకు నెలకు రూ.10 వేలు వేతనంగా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, పార్టీ నేతలు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్, స్వామి, హన్మంత్, తిరుపతి, గోపి, సుధాకర్, కమలాకర్, మోహన్, జితేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పోయిందని నిరసన

గంభీరావుపేట, ఫిబ్రవరి 3: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తాము ఉపాధి కోల్పోయామని, తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతూ శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో ఆటో యజమానులు నిరసన తెలిపారు. స్థానిక తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద ఆదర్శ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. 50 రోజుల క్రితం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తాము ఉపాధి కోల్పోయామని, కనీసం కుటుంబ పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేశారు. దివాలా తీస్తున్న ఆటోవాలాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయకపోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు ఇబాదుల్లాఖాన్, సభ్యులు రాజు, భాను, చందర్, శంకర్, మహేశ్, రమేశ్ పాల్గొన్నారు.

15న ఆటో బంద్

- ఆటో డ్రైవర్స్ జేఏసీ కన్వీనర్ అమానుల్లాఖాన్

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 3: రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు న్యాయం చేసి, వారు ఆత్మహత్యలకు పాల్పడకుండా ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతూ ఈ నెల 15న ఒక రోజు ఆటో బంద్ నిర్వహిస్తున్నట్టు తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ ప్రకటించారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లకు ఉపాధి లభించకపోవడంతో మనోధైర్యం కోల్పోయి ఆటోలను తగల బెట్టడంతోపాటు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఉచిత బస్సు ప్రయాణానికి బదులు సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయంతోపాటు పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచాలని విజ్ఞప్తిచేశారు. 15న ఇందిరా పార్కు నుంచి అసెంబ్లీ వరకు జరిగే ర్యాలీకి అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ నాయకులు మహ్మద్ అజీముద్దీన్, మహ్మద్ దస్తగీర్, ఎస్‌కే మాము, అమర్ సుల్తాన్ పాల్గొన్నారు.

మా తెలంగాణ కోట్ల ఎకరాల మాగాణ!

- 83 శాతం పెరిగిన వివిధ పంటల సాగు విస్తీర్ణం
- ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తొలిస్థానం
- కేరళ మంత్రి బృందంతో తేల్చిచెప్పిన మంత్రి తుమ్మల
- కేసీఆర్ ప్రభుత్వ కృషితో వ్యవసాయం సుభిక్షమని పరోక్ష ఒప్పుకోలు

హైదరాబాద్, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): కేసీఆర్ ప్రభుత్వ కృషితో రాష్ట్రంలో వ్యవసాయరంగం సాధించిన విశేష అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ గుర్తించింది. ఈ మేరకు నాటి పాలనలో జరిగిన అభివృద్ధిని ఇతర రాష్ట్రాల ప్రతినిధులకు గొప్పగా చెబుతున్నది. ఈ మేరకు శనివారం రాష్ట్రానికి వచ్చిన కేరళ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పీ ప్రసాద్‌కు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర వ్యవసాయ సమగ్రాభివృద్ధిని వివరించారు. సచివాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో తెలంగాణలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో చేపడుతున్న వివిధ ప్రభుత్వ పథకాలను, సంస్కరణలను పీపీటీ ద్వారా వివరించారు. తెలంగణ రాష్ట్రం ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నదని, పత్తి ఉత్పత్తిలో మూడో స్థానం నిలిచిందని మంత్రి చెప్పారు. వ్యవసాయానికి, రైతులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయంతోపాటు జీవిత బీమా (రైతుబీమా) పథకాన్ని అమలు చేస్తునట్టు మంత్రి తెలిపారు. పారదర్శకత కోసం సహకార సంఘాల కంప్యూటరీకరణలో తొలిస్థానంలో నిలిచినట్టు తెలిపారు.

2.40 కోట్ల ఎకరాలకు పెరిగిన సాగు విస్తీర్ణం

రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ స్థూల సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్నదని, ప్రస్తుతం ఇది 2.40 కోట్ల ఎకరాలకు అంటే 83 శాతం పెరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేరళ బృందానికి వివరించారు. రాష్ట్రంలో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 2014-15లో 94.90 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 2022-23లో 346.4 లక్షల మెట్రిక్ టన్నులకు అంటే 265.010 శాతం పెరిగిందని తెలిపారు. వరి విస్తీర్ణం 35 లక్షల ఎకరాల నుంచి 121.43 లక్షల ఎకరాలకు, ధాన్యం ఉత్పత్తి 68 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 258 లక్షల మెట్రిక్ టన్నులు వరకు పెరిగిందని చెప్పారు. అయితే వ్యవసాయ రంగంలో జరిగిన ఈ అభివృద్ధి అంతా కూడా కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే జరగడం గమనార్హం. దీంతో కేసీఆర్ ప్రభుత్వంలో వ్యవసాయ రంగం సుభిక్షమని పరోక్షంగా ఒప్పుకున్నట్టేనని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ములుగు జిల్లా మంగపేటలో దళితుల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

దళితబంధు కోసం నిరాహార దీక్ష

మంగపేట, ఫిబ్రవరి 3 : దళితబంధు లబ్ధిదారులకు వెంటనే నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ములుగు జిల్లా మంగపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో దళితబంధు పథకం రెండో విడతకు ఎంపికైన ఆయా గ్రామాల దళితులు తమకు మంజూరైన నిధులను విడుదల చేయాలని కోరుతూ ఒకరోజు దీక్ష నిర్వహించారు. లక్ష్మీనారాయణ వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. నిరుపేద దళిత కుటుంబాల్లో వెలుగులు నింపాలని కేసీఆర్ సర్కారు దళితబంధు ప్రవేశ పెట్టి లబ్ధిదారులను ఈ పథకానికి ఎంపిక చేసిందని తెలిపారు. బ్యాంకు ఖాతాలు తెరిచి, నిధుల కేటాయింపు సైతం పూర్తి అయిందని, ఎన్నికల కోడ్ కారణంగా మంజూరు నిలిచిపోయినట్టు పేర్కొన్నారు. పేద దళితుల పరిస్థితిని అర్థం చేసుకొని వెంటనే వారి ఖాతాల్లో దళితబంధు నిధులు జమచేయాలని డిమాండ్ చేశారు.

నేడు క్యాబినెట్ సమావేశం!

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆదివారం మధ్యాహ్నం జరుగనున్నది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 3.30 గంటలకు సచివాలయంలో జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమాచార ఉత్తర్వులు జారీచేశారు. జీఎస్టీ బిల్లును ఆమోదించడం, అడ్వొకేట్ జనరల్ నియామకానికి ఆమోదం (రాటిఫికేషన్), పంచాయతీరాజ్ చట్టంలో స్వల్ప సవరణలు, గత ప్రభుత్వం సిద్ధంచేసిన మూడు బిల్లులను రద్దు చేయడం, గ్రూప్ -1 ఉద్యోగాలను ఎలా భర్తీ చేద్దాం? మరో రెండు హామీలు ఎలా? ఎప్పటి నుంచి అమలు చేద్దాం? రానున్న బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన అంశాలపై భేటీలో చర్చించే అవకాశం ఉన్నదని తెలిసింది. అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీలు హెడ్‌క్వార్టర్‌లోనే ఉండాలని సీఎస్ ఆదేశించారు.

తెలంగాణ ప్రాజెక్టు రెండో యూనిట్ సక్సెస్

జ్యోతినగర్, ఫిబ్రవరి 3: పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీలోని 1600 మెగావాట్ల తెలంగాణ ప్రాజెక్టులోని రెండో యూనిట్‌లో శనివారం రాత్రి విద్యుదుత్పత్తి విజయవంతంగా పూర్తి సామర్థ్యానికి చేరుకున్నది. 800 మెగావాట్ల సామర్థ్యానికి గాను పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరిగింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం తెలంగాణ కోసం కేటాయించిన 4 వేల మెగావాట్లలో ఫేజ్-1 కింద ఎన్టీపీసీలో నిర్మించిన అల్ట్రా సూపర్ క్రిటికల్ 1600 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులో ప్రథమంగా 800 మెగావాట్ల ఒకటో యూనిట్ నిరుడు ఉత్పత్తి దశలోకి వచ్చింది. రెండో యూనిట్ నిర్మాణం పూర్తి కావడంతో మూడు రోజుల క్రితమే గ్రిడ్‌కు అనుసంధానం చేసి యూనిట్‌లో ఉత్పత్తిని కసరత్తు చేశారు. క్రమంగా విద్యుత్తు ఉత్పత్తి 800 మెగావాట్లకు చేరుకున్నది.

సీఎమ్మార్ ఇవ్వని రైస్‌మిల్ సీజ్

- ప్రభుత్వానికి రూ.1.60 కోట్లు నష్టం

సారంగాపూర్, ఫిబ్రవరి 3: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం గోపాల్‌పేట్ ఎక్స్ రోడ్ సమీపంలో గల శ్రీసాయి అగ్రో ఇండ్రస్ట్రీస్ (రైస్‌మిల్)ను శనివారం డీసీఎస్‌వో శ్రీకళ సీజ్ చేశారు. 2022-23 సంవత్సరానికి గాను ఖరీఫ్‌కు సంబంధించిన 12180 క్వింటాళ్ల ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని రైస్‌మిల్ యజమాని చిలమంతుల మధుప్రియ ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉన్నది. అయితే ధాన్యం తడవడం, యజమాని నిర్లక్ష్యంగా వ్యవహరించి అనుకున్న సమయానికి సీఎమ్మార్ ఇవ్వలేదు. యాజమాన్యం నిర్వాకం వల్ల ప్రభుత్వానికి రూ.1.60 కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు.

ఫ్యాక్టరీ పెట్టకుంటే భూములు వెనక్కి

- అధికారులకు మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశం
- టీఎస్ఐఐసీ కార్యకలాపాలపై సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): పరిశ్రమల ఏర్పాటు కోసం భూములు తీసుకొని నిర్దిష్ట గడువులో వాటిని స్థాపించకపోవతే భూములను వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. గతంలో భూములు పొంది, ఈడీ, సీబీఐ వంటి సంస్థలు జప్తు చేసిన భూములపై హక్కు తిరిగి పొందేలా న్యాయస్థానాల్లో పోరాడేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. శనివారం టీఎస్ఐఐసీ కార్యాలయంలో మంత్రి శ్రీధర్‌బాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర విభజనకు ముందు, తరువాత జరిగిన భూకేటాయింపుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అధికారి ఫీల్డ్ విజిట్ చేసి వినియోగంలో లేకుండా ఖాళీగా ఉన్న భూములను గుర్తించాలని, వినియోగించకపోవడానికి గల కారణాలతో త్వరితగతిన నివేదిక ఇవ్వాలని కోరారు. భూములు పొందిన సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా థర్డ్ పార్టీలకు లీజుకు ఇస్తే ఆ వివరాలను సేకరించాలని మంత్రి ఆదేశించారు. పలు సంస్థలు, కంపెనీలు డివిడెండ్, షేర్ హోల్డ్ అమౌంట్ చెల్లించని అంశాలపై కూడా మంత్రి నివేదిక కోరారు.

తీన్మార్ మల్లన్న భార్యకు డిప్యుటేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ నేత చింతపండు నవీన్‌కుమార్ (తీన్మార్ మల్లన్న) భార్య కొండాపురం మాతమ్మకు ప్రభుత్వం గ్రేటర్‌లోని ఓ స్కూల్లో అన్‌డ్యూటీ సౌకర్యాన్ని కల్పించింది. మాతమ్మ ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం జెడ్పీ హైస్కూల్లో పీఈటీగా పనిచేస్తున్నారు. ఆమెను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నాగోలు జెడ్పీ హైస్కూల్‌లో ఏడాది పాటు అన్‌డ్యూటీ (ఓడీ) సౌకర్యం కల్పిస్తూ యాదాద్రి-భువనగిరి జిల్లా డీఈవో నారాయణరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. మల్లన్న కూతురు వైకల్యంతో బాధపడుతున్న నేపథ్యంలో మానవతా దృక్పథంతో ప్రభుత్వం ఆమెకు ఓడీ సౌకర్యం కల్పించినట్టు తెలిసింది. ఇదే తరహాలో మరికొందరికి సైతం ప్రభుత్వం ఓడీ సౌకర్యాన్ని కల్పించింది. మరోచోట ఎస్సీ భార్యతో పాటు, భార్యకు పక్షవాతం, భర్తకు ధీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారినీ ప్రభుత్వం బదిలీచేసింది.

700 కార్లతో భట్టి భార్య బలప్రదర్శన

- ఖమ్మం లోక్‌సభ స్థానానికి డిప్యూటీ సీఎం భట్టి సతీమణి దరఖాస్తు
- భారీ కార్ల ర్యాలీతో హైదరాబాద్‌కు నందిని రావటంపై పార్టీలో చర్చ
- 17 లోక్‌సభ స్థానాలకు 306 దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క భార్య నందిని ఖమ్మం లోక్‌సభ స్థానానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె బలప్రదర్శనకు దిగారు. ఖమ్మం నుంచి ఏకంగా 700 కార్లతో భారీ ర్యాలీగా హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు చేరుకున్నారు. ఆమె 'బల' ప్రదర్శన పార్టీలో చర్చనీయాంశంగా మారింది. దరఖాస్తు సమర్పణ అనంతరం నందిని మీడియాతో మాట్లాడుతూ ఖమ్మం నుంచి పోటీచేయాలని సోనియాగాంధీ, ప్రియాంకను కోరామని, వారు పోటీచేస్తే అందరం కలిసి గెలిపించుకుంటామని, లేకుంటే ఆ స్థానాన్ని తనకు కేటాయించాలని అధిష్ఠానాన్ని కోరినట్టు చెప్పారు. తుది నిర్ణయం మాత్రం అధిష్ఠానానిదేనని స్పష్టం చేశారు.

కుటుంబ సభ్యులే ఎక్కువ

దరఖాస్తుల ప్రక్రియ శనివారంతో ముగియగా 17 స్థానాలకు మొత్తంగా 306 దరఖాస్తులు వచ్చినట్టు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. వీటిలో ఖమ్మం, నల్లగొండ, మల్కాజిగిరి స్థానాలకు భారీ పోటీ నెలకొన్నది. పలువురు సీనియర్ నేతలతోపాటు వారి కుటుంబ సభ్యులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. నందినితోపాటు రేణుకాచౌదరి, వీహెచ్, మంత్రి పొంగులేటి సోదరుడు ప్రసాద్‌రెడ్డి, మరోమంత్రి తుమ్మల కుమారుడు యుగేందర్ ఖమ్మం టికెట్ కోసం ప్రయత్నిస్తుండగా, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, వీవీసీ గ్రూప్స్ అధినేత రాజేంద్రప్రసాద్ కూడా అదే స్థానం కోసం దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ సీనియర్ నేత కుసుమకుమార్ కూడా అదే స్థానాన్ని ఆశిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ టికెట్ కోసం జానారెడ్డి తనయుడు రఘువీర్‌రెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డితోపాటు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కుమార్తె శ్రీనిధిరెడ్డి కూడా దరఖాస్తు చేసుకున్నట్టు తెలిసింది. భువనగిరి టికెట్ కోసం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భార్య లక్ష్మి టికెట్ ఆశిస్తుండగా, వెంకట్‌రెడ్డి సోదరుడు మోహన్‌రెడ్డి కుమారుడు డాక్టర్ సూర్యపవన్‌రెడ్డి, మరో బంధువు మురళీధర్‌రెడ్డి కూడా దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. సీఎం సన్నిహితుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా రేసులో ఉన్నారు.

ధరణి పోర్టల్ కమిటీ ప్రత్యేక భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్ పునర్నిర్మాణ నిపుణుల కమిటీ సర్వే అండ్ సెటిల్‌మెంట్‌శాఖ, వక్ఫ్ బోర్డు, దేవాదాయశాఖ అధికారులతో సచివాలయంలో శనివారం ప్రత్యేకంగా భేటీ అయ్యింది. ఆయాశాఖల రికార్డులు, సమస్యలు తదితర అంశాలపై చర్చించింది. మూడు శాఖల సమస్యలను అడిగి తెలుసుకున్నది. ప్రస్తుతం సర్వే అండ్ సెటిల్‌మెంట్‌శాఖ నిర్వహిస్తున్న సర్వే రికార్డుల జాబితాతోపాటు వక్ఫ్‌బోర్డుకు సంబంధించి వక్ఫ్ బోర్డు కింద మొత్తం ఎంత భూమి ఉన్నది? కబ్జాలకు ఎంత గురైంది? వక్ఫ్ భూములను రిజిస్ట్రేషన్, రెవెన్యూశాఖ ఎలా రక్షిస్తున్నాయి? ధరణి పోర్టల్‌లో వక్ఫ్ భూముల సమస్య వంటి అంశాలను ప్రస్తావించారు. దేవాదాయశాఖపై దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న భూమి ఎంత? రక్షణకు తీసుకుంటున్న రిజిస్ట్రేషన్, రెవెన్యూశాఖ తీసుకుంటున్న చర్యలు ఏమిటి? ధరణి పోర్టల్‌లో దేవాదాయ భూములు సమస్య ఏమిటి? అనే అంశాలపై చర్చించారు. సమావేశంలో సీసీఎల్ఏ నవీన్ మిట్టల్, ధరణి పునర్నిర్మాణ కమిటీ సభ్యులు కోదండరెడ్డి, రేమండ్ పీటర్, సునీల్‌కుమార్, మధుసూదన్, సీఎమ్మార్వో లచ్చిరెడ్డి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వ్యవహారాల సలహాదారుగా మహమ్మద్ అలీ షబ్బీర్ శనివారం సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు, బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు, ఢిల్లీలో ప్రభుత్వ సలహాదారు మల్లు రవి, జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావు, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఉమర్ జలీల్, గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి నవీన్ నికోలస్ తదితరులు షబ్బీర్ అలీకి శుభాకాంక్షలు తెలిపారు.

రెవెన్యూ వ్యవస్థ పటిష్టానికి చర్యలు

- కేరళ మంత్రితో రెవెన్యూ మంత్రి పొంగులేటి భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన విధానాన్ని రూపొందిస్తున్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వ భూముల పరిరక్షణతోపాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను గుర్తించడంలో రెవెన్యూ యంత్రాం గం పాత్ర కీలకమని తెలిపారు. కేరళ మంత్రి రాజన్‌తో మంత్రి పొంగులేటి శనివారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేరళలో అమలవుతున్న హౌసింగ్ స్కీమ్‌తోపాటు రెవెన్యూ విభాగం పనితీరు పొంగులేటి అడిగి తెలుసుకున్నారు.

రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ ఔదార్యం

తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ నేతలు ఔదార్యం చాటుకున్నారు. తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి రూ.5 లక్షల చెక్కును తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రావుకు శనివారం అందజేశారు. తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రాములు, రమేశ్‌పాక, సెక్రటరీ జనరల్ పుల్‌సింగ్‌హన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించండి

- వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్, ఫిబ్రవరి 3: రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నిర్వహించనున్న మొదటి మంత్రివర్గ భేటీలో పారిశుద్ధ్య కార్మికుల ఉద్యోగ క్రమబద్ధీకరణ అంశంపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఎమ్మార్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ విద్యానగర్‌లోని ఎమ్మార్‌పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ ఈ డిమాండ్ చేశారు.

ఆర్టీసీకి రూ.375 కోట్లు విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ ఆర్టీసీకి రూ.375 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ మేరకు రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జీవో 61 ద్వారా రూ.212.50 కోట్లు, జీవో 62 ద్వారా రూ.162.50 కోట్లను మంజూరు చేశారు.

7 నుంచి 14 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి3 (నమస్తే తెలంగాణ): ఈ నెల 7 నుంచి 14 వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్లకు, మండలస్థాయి అధికారులకు, గ్రామ ప్రత్యేక అధికారులకు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఆదేశాలను జారీ చేశారు. ఆయా అధికారులతో శనివారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవిలో నీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. 15న నిర్వహించే ముగింపు కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో మహిళా, యువజన సంఘాలతో డ్రగ్స్, మద్యం, గుట్కా వంటి దురలవాట్ల ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

వై దిస్ కొలువుల వర్రీ..!

- ఐటీలో జాబ్స్ కోత.. లేఆఫ్‌ల మోత
- 20 ఏండ్ల కనిష్ఠానికి నియామకాలు
- ఫ్రెషర్లకు ప్రైజరే.. ప్లేస్‌మెంట్లకు కరువే
- ఉద్యోగాలపై కొవిడ్, ఉక్రెయిన్ కాటు